# సస్పెన్స్! ఉత్కంఠభరిత రసవంతం

రెండో అంతస్తు- సిటేట్‌లో కూర్చుని- సీరియస్‌గా హారర్ నవల చదువుతున్న పారక్-

ఒక్కసారి చాలా త్రుళ్ళిపడ్డాడు- చిన్న శబ్దానికే

కుర్చీలోంచి- రెయిలింగ్ మీదకి వొంగి- కిందకి చూశాడు

ఒక కుక్క- పరుగెడుతూ

ఒక మనిషి తొందరగా నడుస్తూ

ఆ కుక్క- బక్క చిక్కి ఉంది ఆ మనిషి- ఎండి- ఎముకల పోగులా ఉన్నాడు

అది- ఊరకుక్క వాడు- బిచ్చగాడు అని తొందరగానే కనిపెట్టేశాడు పారక్ అంతే కాదు అక్కడేదో జరగబోతూందనీ యిట్టే పసి గట్టేసిందతని డిటెక్టివ్ మెదడు

పరుగు పందెంలో సమానంగా వొచ్చిన వారిలాగ- కుక్కా మనిషీ ఒక్క క్షణంలోనే- మునిసిపాలిటీ డస్ట్ బిన్‌ని చేరుకున్నారు

ఛీ అన్నాడు వాడు కుక్కని చూస్తూ

బౌ" అందది- మనిషిని గమనిస్తూ

అది పళ్ళు బయట పెట్టింది వికృతంగా కరుస్తా జాగ్రత్తంటున్నట్టు వాడు - కర్ర ఎత్తాడు బాదుతా జాగ్రత్తంటున్నట్టు

అది- వాడిని- అడుగు ముందుకు వేయనీయడంలేదు

వాడు- దానిని అడ్డుతున్నాడు డస్ట్ బిన్ వేపు వెళ్ళనివ్వకుండా

బౌ బౌ అని తిట్లకు లంకించుకుంది గజ్జి కుక్క

నీ యమ్మ నీ యాలి బూతులకి తగులు కున్నాడు కుమ్మ ముష్టాడు కుక్కకి మనిషికీ మధ్య పోరాటం మొదలయింది కుక్కా మనిషీ ఫైటింగ్!

పారక్‌కి- చిన్నతనపు జ్ఞాపకం మెదిలింది మెదడులో

రోడ్డు ప్రక్కన గారడీలంటే- వెర్రెత్తి పోయేవాడు గారడీ చివర- పామూ ముంగిసల పోరాటం పెడతానని ఊరించేవాడు గారడీవాడు తను ఎన్నో గారడీలు చూశాడు కాని- ఏ గారడివాడూ ఎప్పుడూ పామూ- ముంగిసల పోరాటం పెట్టనే లేదు ఒక్కడు ఒక్కసారి కూడా

ఈ మనిషి కుక్కల ఫైటింగూ బానే ఉంది కొంచెం థ్రిల్లింగ్‌గానే ఉంది ఈ మాత్రపు సజీవ పోరాటం మాత్రం ఎందరు చూడగలరు?

పోట్లాట- ఉధృతమయినట్టుంది

కుక్క- మనిషిని అక్కడి నుండి తరిమి కొట్టడానికి శాయశక్తులా ప్రయత్నిస్తూంది వాడి కాలి పిక్క అంకించుకుని అక్కడ లేని కండను పీకెయ్యాలని కోరలు బయటపెట్టి వాడి వేపుకు ఎగురుతోంది

మనిషి కూడా ఊరుకోడం లేదు బక్కగా ఉన్నా బింకంగానే పౌరుషంగానే దాని నెదుర్కొంటున్నాడు కర్రతో అదిలిస్తున్నాడు కొట్టాలని ప్రయత్నిస్తున్నాడు

దెబ్బలాడుతున్న- కుక్క ముఖం- పరమ అసహ్యంగా ఉంది

కాట్లాడుతున్న- మనిషి మొహం- అతి వికృతంగా ఉంది

అది- వాడికి లొంగడంలేదు వాడు దానికి జడవడంలేదు

అసలీ పోట్లాట- దేనికో?- సూదుల్లాంటి కళ్ళతో పరిశోధించాడు పారక్ కనుక్కున్నాడు క్షణంలో డస్ట్ బిన్‌లో ఎంగిలాకులో కొంచెం మాంసం ముక్కలూ ఎక్కువ బొమికెలూ! ఐతేనేం

ఆ కుక్క ఆకలికాపాటి చాలు ఆ మనిషి ఆకలిని కొన్ని గంటలపాటు వాయిదా వేసి- ప్రాణాలు నిలబెట్టడానికి- అది చాలు ఆమాత్రం తిండి చాలు

ఈ పోరాటం- భూమికోసం కాదు ఓట్ల కోసం కాదు నోట్ల కోసం కాదు హీరోయిన్ కోసం కాదు అన్నం కోసం ఆకలి కోసం కడుపు నింపే ఒక కబళం కోసం! అందుచేత యిది కచ్చితంగా టెరిబుల్‌గా సీరియస్‌గా హారిఫయింగ్‌గా

ముదురుతూంది కుక్కా మనుషుల ఆకలి పోరాటం

డస్ట్ బిన్ దగ్గర గోల ఎక్కువయిపోతూంది అక్కడ చిన్న రణరంగంలాగే ఉంది కుక్క- ప్రాణాలకు తెగించి పోరాడుతోంది

మనిషి కూడా తక్కువేమీ తినడంలేదు మొండిగా ఎదుర్కొంటున్నాడు

డస్ట్ బిన్ అనుకున్న గోడ మీద తాటికాయలంత ప్రమాణంలో పౌరుషాన్ని రేకెత్తిస్తున్నట్టు రక్తాక్షరాలు

తిండి లేక చావడం కంటె తుపాకి దెబ్బకి మరణించడం మేలు అదేమో కాని- ఆకలికి అంతమవడం కంటె శునకం చేతిలో (?) శ్వాస వొదలడమే నయమని ఆ మనిషి కడుపు కాలి చావడం కంటె కర్ర దెబ్బకి కన్ను మూయడం మేలు- అని ఆ కుక్కా తీవ్రంగానూ ధృఢంగానూ నిశ్చయించేసుకున్నట్టుంది

పోరాటం జీవన పోరాటం ఆకలి పోరాటం ఉధృతమయింది కుక్క- మనిషిని కరిచేసింది పీకేసింది

మనిషి- కుక్కని బాదేశాడు మోదేశాడు

రక్తాలు కారుతూ మనిషి కాలు వేలాడుతూ కుక్క

ఆ రెండు జీవులనీ బద్ధ శత్రువులనిలాగ చేసి- ప్రాణాలకు తెగించి పోరాడేలా వొదిలి నవ్వుతున్న- మాంసపు, ఎముకల ఎంగిలాకు!

అమ్మా! అబ్బా రక్తాలు కారుతున్న ముష్టివాడు

కుయ్యో కుయ్యో కాలు విరిగిన గజ్జి కుక్క

ఏడుస్తూనే ఉన్నాడు బిచ్చగాడు రోదిస్తూనే ఉంది గజ్జి కుక్క అయినా- ఆ క్షతగాత్ర కుష్ఠువాడూ కాలు విరిగిన కుంటి కుక్కా- కయ్యం ఆపలేదు కబళం కోసం కయ్యం- మరింత తీవ్రమవుతోంది బ్రతికి యుండిన సుఖములు బడయవచ్చు- ననుకోడం లేదా యిద్దరిలో వొక్కరూ బతకడం కోసం- చచ్చయినా గెలవాలను కుంటున్నాయా రెండు జీవులూ

బక్కవానికి కోపమెక్కువన్నట్టు గాయపడిన మనిషి- మరీ చెలరేగుతున్నాడు కుక్క మీద దెబ్బతిన్న కుక్క- మరింత పౌరుషంగా వాడి మీద పడుతోంది పోరాటం బీకరతరమై-

ఎంత థ్రిల్లింగ్‌గా ఉంది అనుకుంటున్నాడు పారక్ మనసులో ఏడుస్తూనే ఓపిక లేకపోయినా దెబ్బలాడుతున్నాడు మనిషి సర్వవిదాలా ఆక్రందిస్తూనే శక్తి లేకపోయినా పోరాడుతోంది కుక్క శాయశక్తులా చూడబోతే ఏ ఒక్కరూ తగ్గేటట్టు లేరు తోక ముడిచేటట్టు లేరు విరోధిస్తూ నిరోదిస్తూ ప్రాణాలకు తెగించిన పోరాటం సలుపుతూ

ఎవరు గెలుస్తారో అనూహ్యంగా ఉంది ఓడినవాళ్ళు- చచ్చారన్న మాటే * పగతో పౌరుషంతో కసితో జరుగుతూంది దెబ్బలాట ఇద్దరిలోనూ ఎదుటి వారిని చంపి తీరాలన్నంత ద్వేషం పట్టుదల

పగబట్టిన పామౌతూంది కుక్క కసి పూనిన తోడేలౌతున్నాడు మనిషి

రక్తపాతం జరుగుతూనే ఉందిప్పటికీ ఒక శవం తథ్యం చెప్పకనే చెబుతూందది వారి మధ్య యుద్ధం జరుగుతున్న తీరు

కుక్క మనిషిని చంపేస్తుందా? మనిషి- కుక్కను చంపుతాడా?

కుక్క మనిషిని చంపితే బాగుంటుంది సెన్సేషనల్ న్యూస్ పేపర్లో పడుతుంది మనిషి కుక్కని చంపితే ప్ఫ్ థ్రిల్లేమీ ఉండదు నో వెల్టీ ఉండదు న్యూస్‌లో

ఫైటింగ్ బలే హారిబుల్‌గా జరుగుతూంది ముదిరిపోతూంది క్షణక్షణమూ ఇంక కొంచెం నిముషాలు కచ్చితంగా- కుక్కో మనిషో ఒకరే మిగులుతారు రెప్పవేయకుండా ఊపిరి బిగబట్టి చూస్తున్నాడు పారక్

ఏమిటండీ దీక్షగా చూస్తున్నారు వెనుక నుంచి శ్రీమతి- కాళింది

డిస్టర్బ్ చేయకు అటు చూడు బలే ఫైటింగ్ సీన్ పావు గంట కిందట ఎవరో ఆ డస్ట్ బిన్‌లోకి- మిగిలిన మాంసం ముక్కలూ ఎముకలూ పొట్లాం కట్టిన ఎంగిలాకు విసిరారు దానికోసం ఓ ముష్టివాడూ, కుక్కా అదే పనిగా ప్రాణాలకు తెగించి పోరాడుకుంటున్నారు చూడు చూడు ఎంత థ్రిల్లింగ్‌గా ఉందో! మనిషి గెలుస్తాడో కుక్క గెలుస్తుందో సస్పెన్స్

మీరు అర్జంటుగా మేడ దిగి ఆ ముష్టివాడినీ కుక్కనీ దూరంగా తరమండి వొణుకిపోతూంది కాళింది– ఆ దృశ్యం చూస్తూ

ఏం? వొద్దు ఫైటింగ్ చాలా బాగుంది థ్రిల్లింగ్‌గా

అది కాదు ఆ మాంసం ముక్కలు ఎముకలు ఎంగిలాకు నేను విసిరినదే

ఎవరు విసిరారన్నది అనవసరం; ఆ ఎంగిలాకు మంచి సీను సృష్టించింది

అది కాదండీ అది విషాహారం! ఎలుకలు న్యూసెన్స్ చేస్తున్నాయని మందు కలిపి పెట్టాను మళ్ళీ అంతలోనే మనసు మారిపోయి పాపమని– విసిరేశాను చేతులు రాక చంపడానికి చేతులు రాక అయ్యో! తొందరగా కిందకి వెళ్ళండి వాళ్ళని తరిమెయ్యండి

ఆ! అది విషాహారమా? బలే! ఐరనీ ఆఫ్ ఫేట్ అంటే యిదే కాబోలు ఎంత విచిత్రం! ఆ రెండు జీవులూ యింత సేపూ జరుపుతున్నది ఆకలి పోరాటమూ, జీవన పోరాటమూ అనుకున్నాను నేనూ వాటిలాగే కాని– అది మృత్యు పోరాటం! మృత్యువు కోసం పోరాటం! తమాషా చూడు ఆ మనిషీ కుక్కా ఎలా పోట్లాడుకుంటున్నారో గెలిస్తే తను విషాహారం తిని చావవలసి వస్తుందని తెలియదు! అదే మిస్టరీ ఏంత చూశావా! కుక్కా, మనిషీ– ఓడిపోయినా చస్తారు గెలిచినా చస్తారు ఓడినవాడు కోర్టులోనూ గెలిచినవాడు కోర్టు బయటా ఏడ్చినట్లు పోరాటంలో ఓటమిలో ఒకరు చస్తే గెలుపులో విషాహారం తిని రెండవ జీవి. రెండు మరణాలకీ మధ్య స్వల్ప వ్యవధి మాత్రమే ఓహ్!' అతని కళ్ళలో మెరుపు

'అదంతా తరువాత అర్జంటుగా వెళ్ళండి కుక్కనీ, మనిషినీ తరిమెయ్యండి

కలతబారిన మనసుతో కన్నీళ్ళతో వేడుకుంది కాళింది

నో! ఉండు సస్పెన్స్‌ని చంపెయ్యకు ఇంక కొంచెం నిముషాలు మాత్రమే ఎవరు గెలుస్తారో తెలిపోతుంది ఎవరు పోరాటంలో చస్తారు ఎవరు విషాహారంతో చస్తారు అనేదే సస్పెన్స్

అతనామెకు మనిషిలా కనిపించటం లేదు. హారర్ థ్రిల్ సస్పెన్స్‌లతో మనసు పూర్తిగా కలుషితమయిపోయిన రాక్షసుడిలా కనిపిస్తుంటే– చూడలేక తనే కిందికి పరుగెత్తింది తడబడుతూ. □



